# పిట్టతగవు

"గౌతమపుత్ర శాతకర్ణులవారి కాలం నుంచీ ఆవకాయ, కుండల్లోనే పెడుతున్నారు. నాకు తెలిసీ నాయనమ్మ కాలంనుంచీ జాడీలు ఉపయోగిస్తున్నారు. అంతేగాని ఫ్రిజిడయిర్‌లో ఆవకాయ దాచుకోవడం అన్నది ముప్ఫయో శతాబ్దము వచ్చినా జరగదు!" నిక్కచ్చిగా చెప్పేసింది పార్వతి. "అయినా గొడ్డు కారాలూ, గోంగూర పచ్చళ్ళూ తినే వాళ్ళం, మార్కెట్టా – గోదపక్కనే అయిరి, ఇక చల్లని మంచినీళ్లు తాగితే మూడురోజులు ముక్కు మూసుకుపోతుంది, నానిగాడికి సరేసరి గొంతుక పూడిపోతుంది. ఇంక మన కెందుకు ఫ్రిజిడయర్?'' అని కోప్పడింది.

అయినా కృష్ణమూర్తి కోరిక చావలేదు.

"వేసంకాలం వస్తుందా – చక్కగా చల్లని నీళ్ళు. ఎప్పుడు కావలిస్తే అప్పుడు ఐస్‌క్రీము, నా స్నేహితురాళ్లు వస్తే డ్రింకులు – ఎంత బాగుంటుందనీ. అయినా నాకో స్నేహితుడు చెప్పాడు– గుత్తి వంకాయ కూరకూడా ఐస్‌కోల్డుగా తింటే చాలా బాగుంటుందట!" ఫ్రిజిడయిర్ అవసరాన్ని ప్రతిపాదించాడు కృష్ణమూర్తి. దానితోపాటే శీతల యుద్ధంకూడా ప్రారంభం అయింది. తను వద్దన్నంతమాత్రాన, తన కోరిక తీర్చుకోవడం మానడు కృష్ణమూర్తి – ఆ సంగతి పార్వతికీ తెలుసు.

పార్వతి హృదయపూర్వకంగా అంగీకరించితే తప్పించి తన సరదా తీరిన తృప్తి ఉండదని కృష్ణమూర్తికీ తెలుసు. వచ్చిన చిక్కు అక్కడ!

పిల్లలిద్దరినీ నిద్దరోకొట్టి తెల్లని చీర, విరబూచిన మల్లెల మాల– చూడ రెండు కళ్ళు చాలవన్నంత ఆకర్షణీయంగా, కడిగిన ముత్యంలాగా గదిలోకి వచ్చింది పార్వతి.

పార్వతిచేత సరే అనిపించే అదను ఇదే అనుకున్నాడు కృష్ణమూర్తి. కాని పార్వతిది లోతుగుండె. పట్టిన పట్టు విడిపించి ఫ్రిజిడయిరు మీదనుంచి మనసు మళ్ళించి, ఆ డబ్బుతో ఎలాగైనా ఓ గజ్జెలపట్టెడ కొనిపించుకోవాలని అదే క్షణంలో పార్వతి నిర్ణయించుకుంది!

వెండిఅంచు పరచిన నల్లని మేఘం కాస్తా వర్షించింది.

మాటా మాటా పెరగడం అలవాటే అయినా, కృష్ణమూర్తి ఇంత మొండి పట్టు పట్టినందుకు, తాను ఓడిపోయినందుకు బాధపడింది పార్వతి. "మీ ఇష్టం. మీ డబ్బూ– మీ సరదాలూ" అని తేల్చేసింది. భార్యతో మాట పట్టింపు వస్తే రెండుమూడు రోజులకంటే ఓర్చుకో

కె. రామలక్ష్మి

లేదు కృష్ణమూర్తి. అలా అని తల వగ్గడం అసలే ఇష్టంలేదు. "పోనీ దాని ఉపయోగం ఎలా ఉంటుందో చూసి కొనుక్కుందాం. అందాకా అద్దెకి తెస్తాను," అని మధ్యేమార్గం సూచించాడు.

ఎప్పుడు పట్టు సడలించాలో తెలిసిన పార్వతి సరేనంది. ఈ సంధి ఫలితమే- మరునాటి మధ్యాహ్నానికల్లా హాల్లో కూర్చున్న ఫ్రిజిడయిరు.

పనివాళ్ళు దాన్నింకా పూర్తిగా సర్దకుండానే దాని తలుపులో చెయ్యి ఇరికించి గావుకేక వేశాడు నానిగాడు. బాబిగాడు బిక్కముఖం వేసి దూరంగా నిలబడ్డాడు.




సాయంత్రం హుషారుగా ఇంటికి వచ్చిన కృష్ణమూర్తికి ఇంట్లో తాండవిస్తున్న నిశ్శబ్దం ఆశ్చర్యాన్ని కల్గించింది. నానిగాడు, బాబిగాడు అతి ఒద్దికగా కిటికీలో కూర్చుని ఏదో చెప్పుకుంటున్నారు.

"అమ్మ ఏది నానీ,'' అని అడుగుతూనే వంటింటిలోకి దారితీశాడు కృష్ణమూర్తి.

పెనంమీద దోసెతో కుస్తీ పడుతూంది పార్వతి. అదిచూసి 'హతోస్మి!' అనుకున్నాడు కృష్ణమూర్తి. పార్వతికి ఎన్ని విద్యలైనా వచ్చాయి గాని పల్చగా నాయనమ్మ వేసిన మినపట్లు వేయడం మటుకు రాలేదు! పార్వతి చేతి దోసె తిన్నప్పుడల్లా నాయినమ్మని మనసారా తలుచుకొనేవాడు కృష్ణమూర్తి.

"ఏం, బాబిగాడు అంతముద్దుగా కూర్చున్నాడు, కొట్టావా?" పార్వతి భుజంమీదనుంచి పెనంమీది దోసెకేసి చూస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"నాకసలు కరెంటు అంటే ఎంత భయమో తెలుసు కదా! ఈ వెధవలు పోయి ఆ ఫ్రిజిడయిరు వెనక కాళీఉంది, అని చేతులు పెట్టి చూస్తున్నారు... ఏమిటి ఆ చప్పుడు అంటూ ఒకటేగోల అనుకో. దాల్లో బావురుపిల్లి ఉందని చెప్పాను," అంది వచ్చేనవ్వు ఆపు

కొంటూ. (బాబిగాడు నానిగాడు ఈ ప్రపంచంలో దేనికైనా భయపడతారంటే— అది ఒక్క బావురుపిల్లికే. ఒకసారి బాగా రక్కి వదలిందో నల్లగండు పిల్లి. ఆరోజు మొదలు పార్వతి కొక ఆయుధం దొరికింది.) ఎంత అల్లరి చేసినా పిల్లలని కొట్టకుండా కంట్రోలు చేయగల పార్వతి నేర్పునకు అభినందనగా వంగి చెంపమీద ముద్దుపెట్టాడు. (భార్యాభర్తలు, అందునా పిల్లలు కల దంపతు లిలా ఉంటారా చిలిపిగా? అని కోప్పడకండి. అలా ఉండాలని నా కోరిక.) 'నే చెప్తానులే' అంటూ బట్టలు మార్చుకొందుకు గదిలోకి నడిచాడు కృష్ణమూర్తి.

తండ్రి వెనకనే ఇద్దరుపిల్లలూ పడక గదిలోకి నడిచారు. ప్రశ్నలు వేయక పోయినా వాళ్ళ కళ్ళల్లోని ప్రశ్నలు అర్థం అయాయి కృష్ణమూర్తికి.

''నానీ నువ్వుగాని అల్లరి చేశావా?''

"లేదే!'' అంటూనే తండ్రి దగ్గిరకి గబగబ వచ్చాడు నానిగాడు.

"నాన్నారూ, ఆ పెట్టెకి వెనక కన్నం ఉందా— దాట్లోంచి ఏవేవో కన్పిస్తున్నాయండీ," అన్నాడు.

పార్వతి ఎందుకు భయపడిందో అర్థం అయింది కృష్ణమూర్తికి. అసలే కరెంటు అంటే దడిసే పార్వతికి ఈ ఫ్రిజిడయిరు పిల్లలు ముట్టుకున్నా భరవా లేదన్న ధైర్యం చెప్పేసరికే తాతలు దిగివచ్చారు. అలాంటిది వెనకాతల వైర్లు ముట్టుకున్నా మామూలుగా ఏం ప్రమాదం లేదని నచ్చచెప్పడం అంత సులభం కాదు. హిస్టీరియా వచ్చేస్తుంది పార్వతికి. (పిల్లలకి ఏం జరుగక పోవచ్చు - అది వేరేవిషయం.)


"నాన్నారూ! అక్కణ్నుంచే ఏదో చప్పుడవుతూందండీ;" ఆత్రంగా అన్నాడు నానిగాడు.

"అవును నానీ! అమ్మ చెప్పినట్టు అందులో బావురుపిల్లే ఉండిఉంటుంది," అన్నాడు కృష్ణమూర్తి. నానిగాడు నమ్మలేదు. వాడికి నమ్మకం కలగలేదు.

"నా కేం భయంఅనుకున్నారా? ఒక్క దెబ్బ తంతాను,'' అని పక్కనున్న బల్లని తన్ని చూపించాడు.

'చెడ్డ చిక్కొచ్చిపడిందే!' అనుకున్నాడు కృష్ణమూర్తి. నానిగాడికి అంతా వివరించి చెప్పవచ్చు. అర్థం చేసుకుంటాడు. కాని పక్కనున్న బాబి నేం చెయ్యడం? "బాబీ, నువ్వెళ్ళి నాన్నగారికి కాఫీ తెమ్మను," అని వాణ్ణి వంట ఇంట్లోకి పంపించాడు.

"చూడు నానీ, దాన్లో మిషను ఉంటుంది. ఎప్పుడేనా మనకి తెలియకుండా షాక్ ఇచ్చినా ఇవ్వచ్చు. అందుకే దాన్ని ముట్టుకోకూడదంది అమ్మ. అయితే నీలాగా బాబి పెద్దవాడుకాదుగా? అందుచేత వాడి కీ సంగతంతా చెప్పడం ఎందుకులే అని బావురుపిల్లి ఉందంది




అమ్మ. నువ్వంటే పెద్దవాడివి. నీకన్నీ తెలుస్తాయి. కాని వాడి కెలా తెలుస్తుంది చెప్పు!" అన్నాడు కృష్ణమూర్తి. మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు.

ఈమాట వినేసరికి నానిగాడికి గుఱ్ఱం ఎక్కినంత గర్వం వచ్చింది. తనని పెద్దవాడంటే అంత యిది వాడికి. నానిగాడికి ఇంకో అందుకూ్కడా సంతోషం వచ్చింది. బాబిగాడిని బాగా ఏడిపించవచ్చు. మరీ భయపెట్టవచ్చు అనుకున్నాడు. అదే మొదలు...

బాబిగాడు అటు వెడితేచాలు కొంప మునిగినట్టుగా అరిచేవాడు— 'ఒరేయ్ జాగ్రత్త' అంటూ.

రోజులు జరిగిపోతున్నాయి. ఫ్రిజిడయిరులో బావురుపిల్లి సంగతి అంతా మరిచిపోయారు—ఒక్క బాబిగాడు తప్ప. పాపం, వాడిది జాలిగుండె. (నా పోలిక - అనుకుంటూ ఉంటాడు అప్పుడప్పుడూ కృష్ణమూర్తి!) అలా పెట్టెలో ఉండిపోయిన పిల్లిమీద రోజు రోజుకీ వాడికి జాలి ఎక్కువఅవుతుంది. తల్లిని ప్రశ్నలు వేసి వేధించాడు.

"ఒక్కతికీ ఎలా తోస్తుంది?"

"దానికి ఆకలేస్తే ఎలాగా?" అంటూ వాడి యక్షప్రశ్నలకి సమాధానం ఆలోచించింది పార్వతి.

"నువ్వు చూడ్డంలేదుగాని, నేను అప్పుడప్పుడు దానికి పాలుపోస్తున్నాను బాబీ," అని అమాయికంగా చూస్తున్న వాణ్ని ఓసారి ఎత్తుకుని, ముద్దుపెట్టుకుని, దింపేసింది పార్వతి.

ఒకరోజు మధ్యాహ్నం ప్లేటులో పాలు పోసి ఫ్రిజిడయిరు ప్రక్కగాపెట్టి దూరంగా పోయి గెడ్డంకింద చేతులాన్చుకుని చూస్తూ కూర్చున్నాడు. బాబిగాడు. అప్పుడే గదిలోంచి హాల్లోకి వస్తూ వాణ్ణి చూసింది పార్వతి.

"ఏం చేస్తున్నావురా?"

"నువ్వు నిద్దరోతున్నావా. పిల్లికి దాహంటా, పాలు పోశాను. వచ్చి తాగుతుందని చూస్తున్నాను;" ఫ్రిజడయిరు మీదనుంచి దృష్టి మళ్ళించకుండా సమాధానం చెప్పాడు బాబిగాడు. పార్వతికి నవ్వొచ్చింది. ఐనా నవ్వలేకపోయింది. 'వెర్రినాగన్నకి ఎంత నమ్మకం?' అనుకుంది.

"మనం చూస్తుండగా పిల్లి ఎక్కడేనా పాలుతాగుతుందిరా? దొంగతనంగా వచ్చి కళ్ళు మూసుకుని తాగేసిపోతుంది. నువ్వు పోయి పడుకో'' అంది. అమ్మ అబద్ధం ఎందుకు చెప్తుందని లేచి వెళ్ళిపోయాడు బాబిగాడు.

అదిమొదలు అడపా తడపా ఇడ్లీ ముక్కలు, రొట్టెముక్కలు, చాక్లెట్లు ఫ్రిజడయిరు ముందు ప్రత్యక్షం కాసాగాయి. రెండో కంటికి కనబడకుండా వాటిని తీసేస్తూంది పార్వతి. ఎప్పుడేనా బాబిగాడు చుట్టుపక్కల ఉన్నప్పుడు ఫ్రిజిడయిరు తలుపు తెరవపోతే 'అమ్మా, పిల్లి లేస్తుంది,' అని అదరిపడేలా కేక వేస్తాడు.


'అమ్మా - ఏం చెయ్యదే; బాబిగాడు ఉట్టి పిరికి. నువ్వు తియ్యి ఫరవాలేదు,' అని భరోసా యిస్తాడు నానిగాడు.

ఇంతకీ ఫ్రిజిడయిరులో ఉన్నవి మంచినీళ్ళ సీసాలు; ఒకటి రెండు కూరగాయలు. ఫ్రిజిడయిరుకి ఇంట్లో ఉపయోగం ఉన్నా లేకున్నా, బాబిగాడికి చెప్పిన అబద్ధం ఎలా సరిచేయడం అన్నది తోచడంలేదు పార్వతికి. అస్తమానూ వాడి ధ్యాస దాల్లో ఉన్న పిల్లి మీదే. వాడి ఊహలకి రెక్కలు వచ్చి చిలవలూ పలవలూ అల్లుకొంటున్నాయి. వాడికి పిల్లిమీద ఎక్కడలేని గౌరవం ఏర్పడింది. దాన్ని ఇంట్లో చూడడానికే భయపడేవాడు. వాడు పిల్లిని కంటితో చూడకపోయినా వాడి ఊహల్లో 'దాని బొమ్మ అచ్చు వత్తినట్టుగా ఉంది. చక్కని కళ్ళు, బొచ్చుతోక, ఎన్నో వర్ణించి తల్లికి చెప్తూండేవాడు .. వాడి ఊహాప్రపంచంలో ఆ పిల్లే - సింహం, పెద్దపులి. ఆ ఫ్రిజిడయిరే కీకారణ్యం.

రెండునెలలు గడిచాయి.

రెండునెలలు గడిచేసరికి పార్వతికీ కృష్ణమూర్తికీకూడా ఫ్రిజిడయిరంటే ముఖం మొత్తింది. ప్రాణం విసిగింది. డబ్బుపోసి ఈ తద్దినం కొనితెచ్చుకోనందుకు ఒకరి నొకరు అభినందించుకొన్నారు.

"సోమవారం వచ్చి తీసుకుపొమ్మన్నాను. కాని బాబిగాడిపిల్లి ఎలాగ?"




పార్వతి అందిస్తున్న తమలపాకులు అందుకొంటూ వీళ్లైతే సుకుమారంగా వున్న ఆ వేళ్ళ కొనలని పంటితో నొక్కాలని చూస్తూ వేళాకోళంగా అడిగాడు కృష్ణమూర్తి. అప్పటిదాకా ఆ ప్రశ్న తలెత్తని పార్వతికి ఏం తోచ లేదు — "ఏదో చెయ్యాలి," అంది యధా లాపంగా.

ఫ్రిజిడయిరు పంపేస్తారని తెలిసింది బాబిగాడికి. వాడికి అందులో ఉన్న పిల్లితో ఎక్కడలేని అనుబంధం ఏర్పడింది. ఏడవడం ఇష్టంలేదు. (నానిగాడు లోకువ చేస్తాడని.) కాని ఏంచెయ్యాలో వాడి చిన్న మెదడుకి తోచడంలేదు. అన్నంకూడా సయించడంలేదు వాడికి.

కృష్ణమూర్తికి ఒక ఆలోచన తట్టింది. 'నీ కంటె నేనే నయం,' అని పార్వతిని ఎత్తిపొడిచాడు.

"బాబీ, నిన్న రాత్రి నువ్వు బాగా నిద్దరోతున్నప్పుడు ... పిల్లితో మాట్లాడాను," అన్నాడు ముద్దుగా భుజంమీద వేసుకు ఎత్తుకు తిప్పుతూ.

ఆమాట వినడంతో నిఠారుగా లేచాడు బాబిగాడు. వాడి కళ్లు ఉత్సాహంతో మెరిశాయి. నోట మాట రానంత ఆత్రంగా అడిగాడు; "నిజంగానా?" అని. వాడిలోని బెంగ, ఆత్రుత చూసి ... పార్వతి అబద్ధం ఆడినందుకూ, దాన్ని తను పొడిగించినందుకూ బాధపడ్డాడు కృష్ణమూర్తి.

అప్పటిదాకా ఉగ్గపట్టుకున్న దుఃఖం కట్టలు తెగింది; "నాన్నారూ, నా కా పిల్లి కావాలి," అని తండ్రి బుజంమీద తలపెట్టి వెక్కి వెక్కి ఏడ్చేశాడు బాబిగాడు.

"నువ్వు పెద్దవాడివే అవుతున్నావు. అలా ఏడవచ్చా బాబీ? ఆ పిల్లికి నువ్వంటే ఇష్టంట. వెళ్ళేముందుగానే నీ కో చిన్న పిల్లి నిస్తానంది. జాగ్రత్తగా చూసుకోమంది;'' కొడుకుని ఓదారుస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

బాబిగాడికి దుఃఖం తగ్గింది. చిట్టి చేతులమండలతో కళ్లు తుడుచుకున్నాడు. 'నిజంగానా?' అన్నాడు.

తలూపాడు కృష్ణమూర్తి.

పసివాడి నమ్మకం అతణ్ణి కదిల్చి వేసింది.

సోమవారం మధ్యాహ్నం అయింది. కృష్ణమూర్తిని ఇంట్లో ఉండమని బాబిగాణ్ణి తీసుకుని బజారుకు వెళ్ళింది పార్వతి. అదే సమయంలో కంపెనీ వాళ్లు రావడం చూసి బ్రతుకు జీవుడా అనుకున్నాడు కృష్ణమూర్తి.

విషాద సంగీతం లేకుండానే ఫ్రిజిడయిరు తిరుగు ప్రయాణం కట్టింది. పడకగదిలో నిద్దరలోఉన్న పిల్లికూనను బుట్టతోసహా తెచ్చి ఫ్రిజిడయిరున్న స్థలంలో పెట్టి నిట్టూర్చాడు కృష్ణమూర్తి. ఆతని మనస్సు ఎంతో తేలిక అయింది.

బజారునుంచి వస్తూనే లోపలికి పరుగెట్టాడు నానిగాడు. ఫ్రిజిడయిరు లేదు. కాని బుట్టలో గాఢంగా నిద్దరోతుంది పిల్లికూన. వాడి ముఖంలో మారిన రంగులా క్షణంలో ఏ కవీ వర్ణించలేడు. వాడి ఆనందం వర్ణనాతీతం. గొంతికలా పిల్లిపిల్ల పక్కగా కూర్చున్నాడు. ముట్టుకోనా వద్దా అన్నట్టు చెయ్యి ముందుకి చాపి వెనక్కి లాక్కున్నాడు. "ఏయ్, ఓ కంటితో చూస్తూంది నాన్నారు," అంటూ నెమ్మదిగా దాని వీపు రాశాడు. పిల్లిపిల్ల గుర్ గుర్ మనడం ప్రారంభించింది. ఆనందంతో మెరిసే కళ్ళతో తడబడే అడుగులతో వెనక్కి చూస్తూ ముందుకి నడిచి తల్లి దగ్గరకి వచ్చాడు బాబిగాడు.

"అమ్మా, నా కీ పిల్లి నచ్చింది," అన్నాడు. తిరిగి పిల్లిదగ్గిరకి పరుగెత్తాడు.

ఎవరూ చూడ్డం లేదుకదా అని పార్వతిని తన చేతుల్లోకి లాక్కుని 'నువ్వే గెలిచావు; మనకి ఫ్రిజిడయిరు అనవసరమే. కాని నాతో ఆడే అబద్ధాలు పిల్లలతో ఆడితే ఎంత గొడవో చూశావా?" అంటూ వంగి చెంపమీద ముద్దు పెట్టు



కున్నాడు. కోపంగా చూడబోయింది పార్వతి. 'అయినా అబద్ధంవల్ల నష్టం జరగలేదే,' అనుకుంది.

'నేనే గెలిచాను, వెధవ ఫ్రిజిడయిరు. ఎందుకు పోసిన డబ్బు' అనుకుంది. పైకేమీ అనలేక అలాగే కృష్ణమూర్తికేసి చూస్తూ ఊరుకుంది. (బహుశా బాబిగాడిలాగే ఈయనా నమ్మేశారు అనుకుందేమో!)

"ఓ అబద్ధానికి ఫలితం పిల్లిపిల్ల ఈసారేనా అబద్ధం ఆడి నాలాంటి ఆడపిల్లని కను," అని తన స్వంతభార్యే అయినా ప్రియురాలినిలా కౌగలించుకున్నాడు కృష్ణమూర్తి.

———